మామిడి రైతులకు అందని పరిహారం

- 8 నెలల క్రితం వర్షాలతో పంటలు ధ్వంసం
- నేలకొరిగిన మామిడి తోటలు, నువ్వుల పంటలు
- జిల్లాలో 25,600 ఎకరాల్లో మామిడి
- మండలంలో 340 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం
- నష్టపరిహారం రాక రైతుల ఆందోళన


నేలకొరిగిన నువ్వుల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)


రాలిన కాయలను ఏరుతున్న రైతులు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: రైతన్నను ప్రకృతితో పాటు ప్రభుత్వ పాలకులు పగబడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులపై ప్రకృతి ప్రకోపం చూపించగా, పరిహారం అందిస్తామని హామీలిచ్చిన పాలకులు మాట తప్పారు. ఎనిమిది నెలల క్రితం భారీ వర్షాలతో మామిడి తోటలు ధ్వంసమై, నువ్వుల పంటలు నేలకొరిగి భారీగా నష్టం వాటిల్లింది. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు. ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలతో ఖైతులకు చేతికందిన మామిడికాయలు నేల రాలి వందలాది ఎకరాల్లో లక్షలాది రూపాయలు నష్టపోయారు. ఉద్యానవనశాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు మామిడి తోటలు, నువ్వుల పంటలు పరిశీలించి నమోదు చేసుకున్నారు. కానీ ఎనిమిది నెలలు గడుస్తున్నా నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించలేదు. నష్ట పరిహారం వస్తుందని ఆశ పడ్డ రైతులకు నిరాశే మిగిలింది. కొంతమంది మామిడి రైతులు లక్షలాది రూపాయలు పెట్టి కౌలుకు తీసుకున్నారు. వారం రోజుల్లో చేతికందిన మామిడి కాయలు తెంపి అమ్ముకుందామన్న దశలో వర్షాలకు నేలరాలడంతో లక్షలాది రూపాయలు నష్టపోయారు.

జిల్లాలో 25,600 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం

జిల్లాలోని 19 మండలాల్లో 23,267 మంది రైతులకు చెందిన 25,600 ఎకరాల్లో మామిడి పంటలకు నష్టం జరిగినట్లు ఉద్యానవనశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు.

340 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం

ఇబ్రహీంపట్నం మండలంలో 340 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం వాటిల్లగా వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టాన్ని నమోదు చేసుకుని పరిహారం కోసం పై అధికారులకు నివేదిక పంపించారు.

8 ఎకరాలు నష్టపోయిన



నాకు 8 ఎకరాల మామిడి తోట ఉంది. మామిడికాయలకు ధర తక్కువ ఉందని వారం రోజుల్లో మామిడి కాయలను తెంపి అమ్ముకుందామని అనుకుంటే ఈదురుగాలులు, అకాల వర్షాలతో కాయలు నేలరాలి రూ.2 లక్షల నష్టం జరిగింది. అధికారులు పరిశీలించినా, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదు.

– గడ్డం మహేశ్, మామిడి రైతు

రూ.లక్ష నష్టం



ఈదురుగాలులు, అకాలవర్షంతో మూడెకరాల్లో వేసిన నువ్వుల పంట చేతికి అందే దశలో నేలరాలింది. దీంతో రూ.1 లక్ష నష్టపోయాను. వ్యవసాయ అధికారులు వచ్చి నష్టపోయిన పంటను పరిశీలించారు. ప్రభుత్వం నష్టపరిహారం రైతులకు చెల్లించలేదు. ప్రభుత్వం పరిహారం అందించాలి.

– జిల్లాల పవన్, రైతు

అధికారులకు నివేదించాం



జిల్లాలో మామిడి పంటలు నష్టపోయిన రైతుల తోటల వద్దకు వెళ్లి మా సిబ్బంది పరిశీలించారు. నష్టం అంచనాలను తయారు చేసి పై అధికారులకు పంపించాం. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందలేదు. ఇబ్రహీంపట్నంలో 340 ఎకరాల్లో నువ్వు పంట నష్టపోయారు.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

క్లుప్తంగా

మల్లన్నపేటలో కొప్పుల తులాభారం


ఎత్తు బంగారం ఇస్తున్న కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట జాతరకు హాజరైన మాజీ మంత్రి ఈశ్వర్‌కు ఆలయ కమిటీ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మల్లన్నకు పూజలు చేసి ఎత్తు బంగారం (బెల్లం) తూకం వేసి ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధెంకి నర్సయ్య, మల్లారెడ్డి, ఎంపీటీసీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన నాయకులు


విప్‌ను ఆహ్వానిస్తున్న నాయకులు

మేడిపల్లి: మండలంలోని తొంబర్రావుపేట నూతన గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవానికి రావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను బుధవారం మామిడి సత్తమ్మ ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బద్దం రాజేందర్ రెడ్డి, మామిడి ధర్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, భీమయ్య, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలి


పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

ధర్మపురి: కేంద్రప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మండంలోని బూరుగుపల్లెలో బుధవారం వికసిత్ సంకల్పయాత్రపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ఈ యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంది తిరుపతి, కార్యదర్శి రవి, సత్యగంగు, సుజాత తదితరులున్నారు.

అయోధ్య రాముని అక్షింతలతో శోభాయాత్ర

మల్లాపూర్: అయోధ్య రామమందిర రాముని అక్షింతలు బుధవారం మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చేరుకున్నాయి. స్థానిక ఉమహేశ్వర స్వామి ఆలయం, హనుమాన్ దేవాలయంలో అయోధ్య రాముని అక్షింతలకు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అయ్యప్పదీక్షాపరులు, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయికల్: అయోధ్యలోని రామమందిరం శ్రీరాములవారి అక్షింతలు బుధవారం మండలంలోని రామాజీపేట, కుమ్మరిపల్లి గ్రామాలకు చేరుకోగా, సీతారామచంద్రస్వామి అక్షింతలను ఆయా గ్రామాల్లోని మహిళలు మంగళహారతులతో శోభాయాత్ర నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు బెజ్జంకి రమాదేవి, చింతలపల్లి స్వప్న, ఎంపీటీసీలు దొంతి నాగరాజు, మహేశ్,నాయకులు,ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ


డీటీని సన్మానిస్తున్న టీఎన్‌జీవో నాయకులు, సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ పద్మ బీర్పూర్‌కు బదిలీపై వెళ్లగా, కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన డీటీ కిరణ్‌కుమార్‌ను టీఎన్‌జీవో డివిజన్ అధ్యక్షుడు మహమూద్, నాయకులు కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రమేష్, గంగాధర్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్


ఎమ్మెల్యేను కలిసిన పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్: గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజయ్‌కుమార్‌ను జగిత్యాల రూరల్ మండల కార్యదర్శులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల కృషితో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయిలో జగిత్యాలకు రెండోస్థానం వచ్చిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా గ్రామంలో పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, వర్మి కంపోస్ట్ షెడ్లు, హరితహారంలో చెట్లు నాటడం, నర్సరీలు ఏర్పాటు చేసి అనేక గొప్ప కార్యక్రమాలు కేసీఆర్ నాయకత్వంలో అమలయ్యాయన్నారు. వీటితో జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యేగా రెండోసారి విజయం సాధించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను బుధవారం జగిత్యాల ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణతో పాటు, అధ్యాపక బృందం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నావంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కేడీసీసీ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి


వడ్డీ పథకాల గురించి వివరిస్తున్న బ్యాంక్ మేనేజర్

కథలాపూర్: కేడీసీసీ బ్యాంకులు అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కేడీసీసీబీ కథలాపూర్ మేనేజర్ రఘునాథ్ శర్మ కోరారు. మండలంలోని భూషణరావుపేటలో కేడీసీసీ బ్యాంక్ నుంచి అందిస్తున్న ప్రత్యేక వడ్డీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో మాట్లాడుతూ సహకార క్రాంతి పథకంలో 546 రోజుల పాటు డిపాజిట్ చేసిన డబ్బులకు 7.5 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 8 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. వ్యాపారస్తులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామన్నారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ శివకుమార్, సర్పంచ్ కూన సులోచన, శ్రీనివాస్, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, పూండ్ర ప్రతాప్‌రెడ్డి, తీట్ల శంకర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

మెట్‌పల్లి: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంను కార్యకర్తలు ప్రతీ గ్రామంలో, పట్టణాల్లో, వార్డులో ఘనంగా నిర్వహించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి కోరారు. పట్టణంలో బుధవారం మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, పూదరి నర్సాగౌడ్, యామ రాజయ్య, అందె మారుతి, ఆవేజ్, షేక్ మహమ్మద్, దోనోజు వెంకటేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

మల్లాపూర్: రాబోయే ఎంపీ, పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకి కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ వేంపల్లి గ్రామ అధ్యక్షుడిగా నూనె కిశోర్‌కు నియమాక పత్రాన్ని అందించారు. ప్రజాపాలనలో అర్హులైన ప్రజలకు ఆరు గ్యారంటీలు అందే విధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఫిషర్మెన్ కమిటీ మండల అధ్యక్షుడు రొడ్డ రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప పడిపూజలో స్వాములు

ధర్మపురి: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మండలపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు భీమనాథి మంగ అశోక్ దంపతుల ఆధ్వర్యంలో గురుస్వాములు పెండ్యాల బాలకృష్ణశర్మ, రాజేష్‌శర్మల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పడిపూజ నిర్వహించి వందలాది మందికి అన్నదానం చేసారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజేశ్ పాల్గొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బుధవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పడిపూజకు గురుస్వామి చొడాల వినోద్ నేతృత్వంలో వందలాది అయ్యప్ప దీక్షాపరులు హాజరయ్యారు. అయ్యప్ప శరణుఘోషతో ఆ ప్రాంగణమంతా మారుమ్రోగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చొడారపు శ్రీనివాస్ గుప్తా, మాజీ అధ్యక్షుడు శివ శ్రీనివాస్, శివ రాంకిషన్, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి

మల్లాపూర్: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి మైలారపు లింబాద్రి అన్నారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యక పరమేశ్వరీ ఆలయ ఆవరణలో బుధవారం ఆర్యవైశ్య మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు గంప శ్రీనివాస్, లక్ష్మీపతి, మంత్రి అంజయ్య, మండల మాజీ అధ్యక్షుడు శివ శ్రీనివాస్, రాంకిషన్ గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు కొనసాగిస్తాం

మల్లాపూర్: సుకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తామని ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొడిసెల సృజన్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో బుధవారం సుకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉయ్యాల సుకుమార్ 5వ వర్ధంతిని నిర్వహించి గ్రామస్తులకు ఉచిత రక్తనమూనా పరీక్షలు చేసి, వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. చిన్న వయసులోనే అకాల మరణం చెందిన తమ మిత్రుడు సుకుమార్ పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొల్లం రాజు, బొల్లం రఘు, చింతల శేఖర్, సోమిడి శేఖర్, పాల్గొన్నారు.

'వాషింగ్టన్ తెలంగాణ' సేవా కార్యక్రమాలు అభినందనీయం

కథలాపూర్: సేవా కార్యక్రమాల్లో 'వాషింగ్టన్ తెలంగాణ' అసోషియేషన్ సభ్యుల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని దుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, కథలాపూర్ మోడల్ స్కూల్‌కు మినరల్‌వాటర్ ప్లాంట్లు, ఫ్రిడ్జ్‌లు బుధవారం సంఘం తరుపున అందించారు. ఒకొక్క పాఠశాలకు రూ. 1 లక్ష వెచ్చించి వీటిని అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధి అయిల్నేని గిరీశ్‌రావు, సర్పంచ్ అంబటి లత, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్, ఇట్టేడి శ్రీధర్‌రెడ్డి, అంబటి పురుషోత్తం, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

పూడూర్‌ను మండలం చేయాలి

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని పూడూర్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని బుధవారం పూడూర్ మండల సాధన జేఏసీ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. 10 గ్రామాలు కలిపి మండలం ఏర్పాటు చేయాలని, దీంతో ప్రజలకు దూర భారం తగ్గి, గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సాధన జేఏసీ కన్వీనర్ బండ రవీందర్‌రెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కూనవేని రాజశేఖర్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గుంటి పెరుమాండ్ల జాతర



కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యోఖీన్‌పూర్ శివారులోని గుంటి పెరుమాండ్ల ఆలయంలో బుధవారం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య స్వామి వారి రథోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో చింత సురేశ్ ప్రసాద్, సునీల్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజయ్ హాజరు కాగా, సభ్యులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పేదలకు అందజేయాలనే ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. నేటి నుంచి జనవరి 6 వరకు ప్రతి వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులందరు దరఖాస్తు చేసుకునేలా కౌన్సిలర్లు చొరవ తీసుకోవాలన్నారు. కాగా అంతకు ముందు 21 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అధికారులు ఉన్నారు.

30 అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 30 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేశ్వర్, డీఈ అభినయ్, ఏఈ లక్ష్మి, టీపీఏ ప్రవీణ్, టీపీఎస్ రమ్య, మేనేజర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- 25 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం
- మున్సిపల్ సమావేశంలో 'సాక్షి' కథనం ప్రస్తావన


సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు

రాయికల్: పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. బుధవారం రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 23న 'సాక్షి'లో ఆదాయం తక్కువ వ్యయం ఎక్కువ.. భవన నిర్మాణంలో కౌన్సిలర్ల చేతివాటం అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై సమావేశంలో సభ్యులు ప్రశ్నించారు. 25 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ హన్మండ్లు మాట్లాడుతూ, రాయికల్ పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సమస్యలు, అదనపు కార్మికుల వేతనాల గురించి, కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు కన్నక మహేందర్, సాయికుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, అన్వరిబేగం, సువర్ణ, కాంతారావు, కో–ఆప్షన్ సభ్యుడు మహేందర్‌బాబు, మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఎన్‌ఆర్‌ఐల విరాళం


విద్యార్థులకు డ్రెస్‌లు, బుక్స్ అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ

జగిత్యాలరూరల్: మండలంలోని మోరపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ బేతి గోపాల్‌రెడ్డి–గంగభవానీ రూ.2 లక్షలతో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణానికి విరాళం అందజేశారు. అదే గ్రామానికి చెందిన మరో ఎన్‌ఆర్‌ఐ ఎడ్మల కృష్ణారెడ్డి విద్యార్థులకు ప్యూరిఫైర్ వాటర్ కోసం రూ.20 వేల విరాళం అందజేశారు. అనంతరం గోపాల్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.30 వేల విలువ గల స్పోర్ట్స్ డ్రెస్‌లు, టై బెల్టులు, అలాగే జిల్లా పరిషత్ పాఠశాలకు సుమారు రూ.50 వేల విలువ గల సీసీకెమెరాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లె సత్తమ్మ, సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ భూమారెడ్డి, ఉపసర్పంచ్ రాంమోహన్, హెచ్‌ఎం కిరణ్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న కౌన్సిలర్ నారాయణరెడ్డి

జగిత్యాలరూరల్: మండలంలోని హబ్సీపూర్ గ్రామానికి చెందిన పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలకు కౌన్సిలర్ ముస్కు నారాయణ రెడ్డి బుధవారం ఆర్థికసాయం అందించారు. ఇమ్మడి మహేశ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన కుటుంబానికి రూ.20 వేలు, క్లబ్ నుంచి 10 వేలు, అలాగే గ్రామానికి చెందిన ముగ్గురు దళితులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున అందజేశారు. ముస్కు పద్మ కుటుంబానికి రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీను, భీమయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి..

మల్యాల: మండల కేంద్రానికి చెందిన బావు లత అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి ముదిరాజ్ యూత్ మండలాధ్యక్షుడు దొంతరవేణి శేఖర్ బుధవారం రూ.10,016 ఆర్థిక సాయం అందించారు.భవిష్యత్‌లో అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సంకూర్తి సునీల్, కీసరి గణేశ్, గడుగు నర్సయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ..

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో బుధవారం అనారోగ్యంతో వృద్ధురాలు కలాలి ఎల్లవ్వ(80) మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఇన్‌చార్జి ఉపసర్పంచ్ తిరుపతి, వార్డుసభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, జీపీ నిధుల నుంచి దహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

నేటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు

జగిత్యాలరూరల్/కోరుట్లరూరల్/ధర్మపురి/ఇబ్రహీంపట్నం/కథలాపూర్ /మల్యాల/ గొల్లపల్లి: జిల్ల వ్యాప్తంగా నేటి నుంచి జనవరి 6 వ తేదీ వరకు ప్రజా పాలన చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో అధికారులు సమావేశాలు నిర్వహించి ప్రజాపాలన కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు.అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా నిర్వహించాలని ప్రజాపాలన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు, సింగిల్ విండో చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రజాపాలనలో వార్డుమెంబర్లు కీలకపాత్ర పోషించాలి

రాయికల్: ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీ వార్డుమెంబర్లు గ్రామాల్లో కీలకపాత్ర పోషించాలని వార్డు మెంబర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎలేటి జలేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారంటీల అమలుకు నిర్వహిస్తున్న ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా వార్డుమెంబర్లు పాల్గొని కీలకపాత్ర పోషించాలని కోరారు.